మళ్లీ ఎగరనున్న వైఎస్సార్ సీపీ జెండా

- అభివృద్ధికి చిరునామా ఏలూరు నగరం
- రూ.443 కోట్లతో అభివృద్ధి పనులు
- 1.87 లక్షల మంది లబ్ధిదారుల ఖాతాల్లో రూ.447 కోట్ల జమ
- ఆరోగ్యశాఖ మంత్రిగా ఆళ్లనాని విస్తృత సేవలు



ఏలూరులో సీఎం జగన్ సభలో ఎమ్మెల్యే నాని, ఎంపీ అభ్యర్థి సునీల్‌కుమార్ (ఫైల్)

ఏలూరు టౌన్: ఏలూరులో ఫ్యాన్ గాలి జోరుగా వీస్తోంది. ఎమ్మెల్యే ఆళ్ల నాని హవా మరోసారి కొనసాగనుంది. ఒకవైపు ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్‌రెడ్డి చరిష్మా.. మరోవైపు ఎమ్మెల్యే నాని ఇమేజ్‌తో ఏలూరులో మరోసారి చరిత్ర సృష్టిస్తూ వైఎస్సార్ సీపీ జెండా ఎగరనుందని క్యాడర్ ధీమా వ్యక్తం చేస్తోంది. ఐదేళ్ల సంక్షేమ పాలనలో 85 శాతం ప్రజలకు సంక్షేమ పథకాలు నేరుగా అందజేయటమే కాదు.. ఏలూరు నగరాన్ని అభివృద్ధి పథంలో పరుగులు పెట్టించటంలోనూ జగన్ సర్కారు సఫలీకృతమైంది. ఏ నోట విన్నా జై జగన్... జై ఎమ్మెల్యే ఆళ్ల నాని అంటూ క్యాడర్, అభిమానులు ఊపుమీద కనిపిస్తున్నారు. ఇక సార్వత్రిక ఎన్నికల్లో ఆఖరి ఘట్టానికి చేరుకోగా.. నేడు ప్రజలు తమ ఓటు హక్కును వినియోగించుకోనున్నారు.

వైఎస్సార్ సీపీ వైపే జనం

ఏలూరు నియోజకవర్గంలో టీడీపీ కూటమికి దిమ్మ తిరిగేలా ప్రజలు షాక్ ఇచ్చేందుకు సిద్ధమయ్యారు. తొలుత ఇద్దరు, ముగ్గురు టీడీపీలో చేరగానే చంకలు గుద్దుకుంటూ ప్రగల్భాలు పలికిన టీడీపీ నేతలకు కౌంటర్ గట్టిగా పడిందనే చెప్పాలి. ప్రతి రోజూ వందలాదిమంది టీడీపీ, జనసేన నుంచీ వైఎస్సార్ సీపీలో చేరటం కూటమి డొల్లతనానికి నిదర్శనం. ఎమ్మెల్యే నాని సారథ్యంలోనే ప్రశాంతమైన జీవనం సాధ్యమనే నిర్ణయానికి ప్రజలు వచ్చారు. ఏలూరులో బీసీ, ఎస్సీ, ఎస్టీ, ముస్లిం మైనార్టీ, వైశ్యులు, వ్యాపార వర్గాలు, ముఖ్యంగా డ్వాక్రా అక్కాచెల్లెమ్మలు వైఎస్సార్ సీపీ వైపు మొగ్గు చూపుతున్నారు. ఎమ్మెల్యే నాని సామాజిక వర్గం సైతం మెజార్టీ నేతలు సైలెంట్‌గా నానికే జై కొట్టటం చూస్తుంటే గెలుపు నల్లేరుమీద నడకలా మారిందనే అభిప్రాయం వ్యక్తమవుతుంది.

జనంతో మమేకమవుతూ..

ఎమ్మెల్యే నాని ఏడాదిన్నర కాలంగా ప్రజల్లోనే ఉంటూ వారి సమస్యలు తెలుసుకుంటున్నారు. గడపగడపకూ మన ప్రభుత్వం కార్యక్రమంలో ప్రతి ఇంటికీ వెళ్లి ప్రజలకు సంక్షేమ పథకాలు ఏవిధంగా అందుతున్నాయో తెలుసుకున్నారు. వృద్ధులు, అక్కాచెల్లెమ్మలతో మాట్లాడుతూ సంక్షేమ పథకాల మంజూరులో ఇబ్బందులను తెలుసుకుని పరిష్కరించారు. నియోజకవర్గం స్థాయిలో పార్టీ ముఖ్యకార్యకర్తల సమావేశాలు, డివిజన్ స్థాయిలో పార్టీ నేతలతో సమావేశాలు, క్యాంపు కార్యాలయంలో చేరికలతో ప్రతి ఒక్కరినీ కలుస్తూ ముందుకు సాగారు. ఏలూరు నగర మేయర్ షేక్ నూర్జహాన్, ఇడా చైర్మన్ బొద్దాని శ్రీనివాస్, ఏఎంసీ చైర్మన్ నెరుసు చిరంజీవులు, డిప్యూటీ మేయర్లు గుడిదేశి శ్రీనివాసరావు, నూకపెయ్యి సుధీర్‌బాబు, ఏఎంసీ మాజీ చైర్మన్ మంచెం మైబాబు, సాహిత్య అకాడమీ చైర్‌పర్సన్ పిల్లంగోళ్ల శ్రీలక్ష్మి, కోఆప్షన్ సభ్యులు మున్నుల జాన్‌గురునాథ్, ఎస్ఎంఆర్ పెదబాబు ఇలా నేతలంతా ఆయన వెంటే సాగారు.

సంక్షేమ రథసారధికి జేజేలు

రాజకీయ రంగంలో కొత్తతరహా విధానాలకు శ్రీకారం చుట్టిన సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సంక్షేమ రథసారధిగా ప్రజలతో కొనియాడుతున్నారు. రాజకీయ పార్టీలు, కులం, మతం భేదం లేకుండా ప్రతి ఒక్కరికీ సంక్షేమ పథకాలు అందించటం రాజకీయాల్లో నూతన ఒరవడిగా మారింది. ఏలూరులో ఓటర్లు సుమారుగా 2.32 లక్షల మంది ఉంటే.. వారిలో ఏకంగా 1.87 లక్షల మందికి సంక్షేమ పథకాల రూపంలో రూ.447 కోట్లు నేరుగా వారి ఖాతాల్లోనే జమ చేయటం విశేషం. కేవలం మహిళల ఖాతాల్లోకే సుమారు రూ.400 కోట్లు జమ చేయటం పట్ల మహిళా లోకం సంతృప్తి వ్యక్తం చేస్తోంది. వైఎస్సార్ ఆరోగ్యశ్రీ పథకంలో విస్తృతంగా చికిత్సలు అందిస్తూ ఆదుకుంటున్నారు. ఒక్క ఏలూరులో సీఎంఆర్ఎఫ్ నిధులు వేలాదిమందికి మంజూరు చేయించారు.

అభివృద్ధికి కేరాఫ్ ఏలూరు

ఏలూరు నగరాన్ని అభివృద్ధి పథంలో ముందుకు తీసుకువెళ్లేందుకు ఎమ్మెల్యే నాని విశేష కృషి చేశారనే చెప్పాలి. రూ.525 కోట్లతో ఏలూరు ప్రభుత్వ మెడికల్ కళాశాల ఏర్పాటు, రూ.80 కోట్లతో తమ్మిలేరు ఏటిగట్టు రివిట్‌మెంట్, నగరంలో సెంటర్ లైటింగ్, ప్రధాన రోడ్ల అభివృద్ధి, సీసీ రోడ్లు, సీసీ డ్రెయిన్లు, ఏడు విలీన గ్రామాలకు తాగునీటి సరఫరాకు ప్రణాళిక, నియోజకవర్గంలో 32 వేల మంది పేదలకు జగనన్న ఇళ్ల కాలనీల్లో స్థలాల మంజూరు, జగనన్న కాలనీల్లో విద్యుత్ సరఫరాకు సబ్‌స్టేషన్లు ఇలా చాలానే ఉన్నాయి. ఏలూరు నగరంలోని సుమారు 21 కుల సంఘాలు, ఆయా వృత్తులకు చెందిన సంఘాల అభ్యున్నతికి కమ్యూనిటీ హాల్స్ నిర్మించేందుకు ప్రతి సంఘానికీ 500 నుంచి వెయ్యి గజాల స్థలం మంజూరు చేశారు. ప్రతి కుల సంఘానికీ రూ.10 లక్షల ఆర్థిక సాయం ఎమ్మెల్యే నాని ఆధ్వర్యంలో అందజేయటం విశేషం.

కరోనా కష్టకాలంలో భరోసా

కరోనా మహమ్మారి ప్రపంచాన్ని వణికించింది. వేలాదిమంది ప్రాణాలకు రక్షణగా నిలుస్తూ వైఎస్సార్ సీపీ ప్రభుత్వం అత్యుత్తమ స్థాయి వైద్య చికిత్సలు, సేవలు అందించింది. నాడు డిప్యూటీ సీఎంగా, ఆరోగ్యశాఖ మంత్రిగా ఆళ్ల నాని రాష్ట్రమంతా విస్తృతంగా పర్యటిస్తూ ప్రజలకు అండగా నిలిచారు. ఏలూరు జీజీహెచ్‌లో అద్భుతమైన చికిత్సలతో ఎందరో ప్రాణాలను వైద్యులు నిలబెట్టారు. పోలీస్, రెవెన్యూ, వైద్య ఆరోగ్యశాఖ, కార్పొరేషన్ సిబ్బంది ప్రాణాలకు తెగించి మరీ ప్రజలకు సేవలు అందించారు. జీజీహెచ్‌లో ఆక్సిజన్ ఉత్పత్తి ప్లాంట్లు యుద్ధప్రాతిపదికన ఏర్పాటు చేయటం, ఆక్సిజన్ సరఫరాతో బెడ్లు అందుబాటులో ఉంచి ప్రజల ప్రాణాలకు భరోసా కల్పించారు. ఏలూరు సీఆర్ఆర్ కళాశాలలో క్వారంటైన్ కేంద్రాలు ఏర్పాటు చేసి, నాణ్యమైన భోజనం, పౌష్టికాహారాన్ని అందించి, ప్రజలతో భేష్ అనిపించుకున్నారు.

వలంటీర్ల సేవలు మరువలేం

కరోనాతో జనం ఇళ్లకే పరిమితం కాగా వలంటీర్లు, వైద్య సిబ్బంది ప్రతి ఇంటికీ వెళ్లి కుటుంబంలోని వ్యక్తుల ఆరోగ్య వివరాలు తెలుసుకున్నారు. కూరగాయలు, మాస్కులు, శానిటైజర్లు, నిత్యావసర సరుకులు సైతం అందజేస్తూ ప్రజలకు ఉత్తమ సేవలు అందించారు. అవ్వాతాతలకు పింఛన్ పంపిణీ ఎక్కడా ఆగిపోలేదు. ప్రాణాలకు ముప్పు ఉందని తెలిసినా ప్రజా సేవలోనే నిమగ్నమయ్యారు. కరోనా టెస్టుల్లోనూ, కరోనా వాక్సినేషన్‌లోనూ వలంటీర్ల పాత్ర కీలకం.



ఎమ్మెల్యే నాని సమక్షంలో వైఎస్సార్ సీపీలో చేరిన టీడీపీ నాయికులు (ఫైల్)



ఏలూరు నగరంలో కరోనా కష్టకాలంలో వృద్ధులకు అండగా వలంటీర్ (ఫైల్)



ఏలూరులో ప్రభుత్వ వైద్య కళాశాల (ఫైల్)

క్లుప్తంగా

వైఎస్సార్‌సీపీని గెలిపించండి



ఎమ్మెల్యే అభ్యర్థి కొఠారు అబ్బయ్యచౌదరి



ఎంపీ అభ్యర్థి కారుమూరి సునీల్ కుమార్

దెందులూరు: ప్రతి గ్రామం, ప్రతి కుటుంబం అభివృద్ధి, సంక్షేమం జరిగేందుకు వైఎస్సార్ సీపీని గెలిపించాలని వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి కొఠారు అబ్బయ్యచౌదరి, ఏలూరు ఎంపీ అభ్యర్థి కారుమూరి సునీల్‌కుమార్ కోరారు. ఆదివారం దెందులూరు ఎమ్మెల్యే కార్యాలయంలో వారు మాట్లాడుతూ గడిచిన ఐదేళ్లలో సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నవరత్న పథకాలతో పాటు పూర్తి చేసిన అభివృద్ధి పనులు, గత టీడీపీ హయాంలో పాలనను గుర్తెరిగి ప్రజలందరూ వ్యత్యాసాన్ని గమనించి వైఎస్సార్‌సీపీని బలపరచాలని కోరారు. ఓటర్లు ఉదయాన్నే పోలింగ్ కేంద్రానికి వెళ్లి ఓటు హక్కు వినియోగించుకోవాలని వారు కోరారు.

చూపించు సిరా చుక్క.. డిస్కౌంట్ అందుకో ఎంచక్కా..

మొగల్రాజపురం (విజయవాడ తూర్పు): ఓటర్లల్లో ఓటింగ్ శాతాన్ని పెంచాలనే మంచి ఉద్దేశంతో కొన్ని వ్యాపార సంస్థలు ఓటు వేసిన వారికి తమ సంస్థల్లో ప్రత్యేకంగా డిస్కౌంట్లు అందిస్తున్నాయి. ఓటు వేసిన తర్వాత చేతికి ఉన్న సిరా చుక్క ఆధారంగానే ఈ డిస్కౌంట్‌ను అందజేస్తామని ప్రకటించారు.

- ఏలూరు జిల్లా కేంద్రంలోని ఎన్ఆర్ పేటలో ఒక డాక్టర్ (శ్రీ సిద్ధార్థ ఈఅండ్‌టీ అండ్ డెంటల్ ఆసుపత్రి, డాక్టర్ సీఎస్ రాజు) సోమవారం ఓటు వేసిన తర్వాత తమ ఆసుపత్రికి వచ్చిన వారికి ఆరు నెలల పాటు కన్సల్‌టేషన్ ఫీజు తీసుకోకుండా ఉచితంగా వైద్యసేవలు అందిస్తామని ప్రకటించారు.
- మరి ఇంకేందుకు ఆలస్యం ఓటు హక్కు అనేది మన బాధ్యత ఆ బాధ్యతను నెరవేర్చిన తర్వాత ఈ డిస్కౌంట్స్‌ను ఉపయోగించుకోవచ్చు. పదండి పోలింగ్ బూత్‌కు వెళ్లి ఓటు హక్కును వినియోగించుకుందాం.

మహిళలే కీలకం



భీమడోలు: సోమవారం నిర్వహించనున్న సార్వత్రిక ఎన్నికల్లో మహిళా ఓటర్లు కీలకం కానున్నారు. నియోజకవర్గంలోని బరిలో నిలిచిన అభ్యర్థుల భవితవ్యాన్ని ఓటర్లు నిర్ణయించనున్నారు. తాజాగా విడుదల చేసిన ఓటర్ల తుది జాబితాలో ఉంగుటూరు నియోజకవర్గంలో పురుషుల కన్నా మహిళల ఓటర్లలే అధికం కావడం విశేషం. ఎన్నికల్లో మహిళలు ఎటువైపు మొగ్గు చూపుతారో వారు గెలుపు ఖాయమని రాజకీయ విశ్లేషకులు చెబుతున్నారు. మహిళల ఓట్లు కీలకం కానున్న నేపథ్యంలో సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మహిళలకు ఇచ్చిన హామీల్లో 99 శాతం అమలు చేసి మహిళాభివృద్ధికి పెద్ద పీట వేసారు. ప్రతిపక్షాలు వారిని టార్గెట్ చేసి మేనిఫెస్టో విడుదల చేసినప్పటికీ కూటమి మేనిఫెస్టోను మహిళలు నమ్మడం లేదు. జగన్‌మోహన్‌రెడ్డి తన మేనిఫెస్టోలోని ప్రతి అంశాన్ని నూరుశాతం అమలు చేస్తాడనే నమ్మకం ప్రగాఢంగా నిలిచింది. జగన్‌మోహన్‌రెడ్డి రెండోసారి సీఎం అయితే మహిళలకు రెట్టింపు ఆర్థిక లబ్ధి చేకూరుతుందని రాజకీయ విశ్లేషకులు చెబుతున్నారు. ఉంగుటూరు నియోజకవర్గంలో భీమడోలు, ఉంగుటూరు, నిడమర్రు, గణపవరం మండలాల్లో 2,06,437 ఓటర్లు ఉండగా వారిలో పురుషులు 1,01,545, మహిళలు 1,04,886 ఉన్నారు. ట్రాన్స్‌జెండర్లు ఆరుగురు ఉన్నారు.

కూరగాయల ధరలు

ఏలూరు నగరంలోని రైతు బజార్లలో కూరగాయల ధరలు

కూరగాయలు	కిలో ధర	కూరగాయలు	కిలో ధర
టమాటాలు	28	అరటి కాయ (1)	05-07
వంకాయలు (గులాబీ)	28	చిక్కుడు కాయలు	100
వంకాయలు (కాంతులు)	34	చామదుంపలు	54
వంకాయలు (తెలుపు)	30	ములక్కాడలు	04-06
బెండకాయలు	36	కంద	72
పచ్చిమిర్చి	64	బీట్‌రూట్	36
కాకర కాయలు	34	కీరా దోస	30
బీరకాయలు	34	ఫ్రెంచ్‌బీన్స్	168
బీరకాయలు (పందిరి)	48	అల్లం	160
క్యాబేజీ	26-28	కొత్తిమీర (కట్ట)	25
క్యారెట్	34-48	పాలకూర	12
దొండకాయలు	34	చుక్కకూర	12
బంగాళదుంపలు	34	తోటకూర	10
ఉల్లిపాయలు	28	గోంగూర	07
గోరుచిక్కుడు	48	పుదీనా	05
దోసకాయలు	22	బఠాణి	--
ఆనపకాయ (1)	15-20	క్యాప్సికమ్	70
పొట్లకాయ(1)	15-20	చిలకడదుంప	38-44

ఆర్టీసీ సమాచారం

ఏలూరు ఆర్టీసీ డిపో నుంచి దూరప్రాంతాలకు వెళ్లే బస్సుల సమయాలు, రిజర్వేషన్ వివరాలు

ఏసీ బస్సులు..

బస్సు రూటు	సమయం	అందుబాటులో ఉన్న సీట్లు
ఏలూరు -బీహెచ్‌ఈఎల్	21.00	00
ఏలూరు - బీహెచ్‌ఈఎల్ (అమరావతి)	22.30	00
ఏలూరు - బీహెచ్‌ఈఎల్ (అమరావతి)	22.00	00
ఏలూరు - తిరుపతి(ఇంద్ర)	19.00	03

సూపర్ లగ్జరీ

బస్సు రూటు	సమయం	సర్వీస్ నంబర్	అందుబాటులో ఉన్న సీట్లు
ఏలూరు -బీహెచ్‌ఈఎల్	21.45	4820	00
ఏలూరు -బీహెచ్‌ఈఎల్	21.15	4822	01
ఏలూరు -బీహెచ్‌ఈఎల్ వయా కే.కోట	19.30	4796	00
ఏలూరు -బీహెచ్‌ఈఎల్ వయా రామచంద్రపురం	19.45	4798	00
ఏలూరు -బీహెచ్‌ఈఎల్ వయా ఖమ్మం	20.30	4800	02
ఏలూరు -బీహెచ్‌ఈఎల్	20.15	4802	00
ఏలూరు -బీహెచ్‌ఈఎల్ వయా ఖమ్మం	21.00	4804	00
ఏలూరు -ఈసీఐఎల్	22.30	4814	00
ఏలూరు -తిరుపతి	16.00	4830	19

ఎన్నికలకు పూర్తిస్థాయిలో ఏర్పాట్లు



సీఆర్ఆర్ ఉమెన్స్ కళాశాలలో ఈవీఎంలు తరలిస్తున్న సిబ్బంది



సిబ్బందికి భోజనం వడ్డిస్తున్న కలెక్టర్ ప్రసన్న వెంకటేష్



పోలింగ్ కేంద్రాలకు వెళ్లేందుకు సిద్ధంగా ఉన్న బస్సులు

ఏలూరు (ఆర్ఆర్‌పేట): సోమవారం నిర్వహించే సార్వత్రిక ఎన్నికలకు ఏలూరు నియోజకవర్గానికి సంబంధించిన ఏర్పాట్లను అధికారులు పూర్తి స్థాయిలో చేశారు. ఏలూరు నియోజకవర్గంలో మొత్తం 2,35,345 మంది ఓటర్లు ఉండగా, వీరిలో 1,12,426 మంది పురుషులు, 1,22,872 మంది స్త్రీలు, 41 మంది ట్రాన్స్‌జెండర్లు ఉన్నారు. ఎన్నికల బరిలో 14 మంది పోటీ పడుతున్నారు. ఓటర్లు తమ ఓటు హక్కును వినియోగించుకోవడానికి నియోజకవర్గ వ్యాప్తంగా 213 పోలింగ్ బూత్‌లను సిద్ధం చేశారు. ఆయా బూత్‌లలో షామియానాలు వేసి ప్రాథమిక చికిత్స శిబిరాలు ఏర్పాటు చేశారు. వృద్ధులకు, నడవలేని వారి సౌకర్యార్థం ప్రతి పోలింగ్ బూత్‌లో వీల్ చెయిర్‌లు, విభిన్న ప్రతిభావంతుల కోసం ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. పోలింగ్ బూత్‌ల వద్ద తాగునీటి సౌకర్యం కల్పించారు. పోలింగ్ సామగ్రి స్థానిక కోటదిబ్బ ప్రభుత్వ జూనియర్ కళాశాల నుంచి సిబ్బందికి అందజేయగా, వారు తమకు కేటాయించిన బూత్‌లకు తరలించారు. ఎన్నికల నిర్వహణ కోసం నియోజకవర్గానికి 1,331 మంది సిబ్బంది, అధికారులను నియమించారు. వీరిలో 237 మంది పీఓలు, 235 మంది ఏపీఓలు, 860 మంది ఓపీఓలు ఉన్నారు. వారు కాక 51 మంది మైక్రో అబ్జర్వర్లు ఎన్నికల పరిశీలకులుగా వ్యవహరిస్తారు.

సార్వత్రిక ఎన్నికలకు సర్వం సిద్ధం

ఏలూరు రూరల్ : ఏలూరు రూరల్ మండల గ్రామాల్లో సార్వత్రిక ఎన్నికలకు అధికారులు సర్వం సిద్ధం చేశారు. పాఠశాల, పంచాయతీ కార్యాలయాల్లో 34 పోలింగ్ కేంద్రాలు ఏర్పాటు చేశారు. సిబ్బంది ఈవీఎంలతో ఆదివారం పోలింగ్ కేంద్రాలకు చేరుకున్నారు. అధికారులు మహిళలు, పురుషులు ఓటు హక్కు వినియోగించుకునేలా వేరువేరుగా కేంద్రాలను ఏర్పాటు చేశారు. పోలింగ్ కేంద్రాల వద్ద సూచిక బోర్డులు, టెంట్లు, మంచినీరు తదితర మౌలిక సదుపాయాలు కల్పించారు. ఓటర్ల జాబితా అందుబాటులో ఉంచారు. ఇప్పటికే బీఎల్‌ఓలుగా వ్యవహరిస్తున్న సచివాలయ సిబ్బంది గ్రామాల్లో ఓటర్లకు స్లిప్స్ పంపిణీ చేశారు. 15 గ్రామ పంచాయతీ పరిధిలో మొత్తం 32,484 మంది ఓటర్లు ఓటు హక్కు వినియోగించుకోనున్నారు. వీరిలో పురుషులు 15,576 మంది, స్త్రీలు 16,398 మంది, థర్డ్ జెండర్ ఒక్కరు ఉన్నారు. 2019 నాటి ఎన్నికల్లో మండలంలో 31,986 మంది ఓటర్లు ఉండగా, ఈ ఎన్నికల్లో 498 మంది కొత్తగా చేరారు. మొత్తం ఓటర్లతో బీసీలు అత్యధికంగా ఉన్నారు.



శనివారపుపేట పాఠశాలలో ఏర్పాటుచేసిన పోలింగ్ బూత్ వద్ద టెంట్లు



చాటపర్రు పోలింగ్ కేంద్రంలో ఓటర్ లిస్ట్ సిద్ధం చేసుకుంటున్న సిబ్బంది



ఎన్నికల సామాగ్రితో పోలింగ్ కేంద్రానికి వెళ్తున్న సిబ్బంది



ఈవీఎంలు తరలిస్తున్న సిబ్బంది

గిరిజన సంప్రదాయంలో ఘన స్వాగతం



కాకసనూరులో పోలింగ్ కేంద్రానికి వెళుతున్న పోలింగ్ సిబ్బంది

ఏలూరు(మెట్రో): కాకసనూరు పోలింగ్ సిబ్బంది ఊహించని స్వాగతం లభించింది. ఏలూరు జిల్లా, కోయిదా గ్రామ పంచాయతీ పరిధిలో ఉన్న కాకసనూరు పోలింగ్ కేంద్రం జిల్లా కేంద్రానికి సుమారు 180 కిమీ దూరంలో ఉంది. ఐటీడీఏ కోటరామచంద్రపురంలో పరిధిలో ఉన్న ఈ పోలింగ్ కేంద్రం జిల్లాలో ఉన్న 1744 పోలింగ్ కేంద్రాల్లో ఒకటి. కాకసనూరు తండా గోదావరి నది మధ్యలో ఉండడం వల్ల సరైన రవాణా సౌకర్యం, విద్యుత్ సదుపాయం లేదు, సెల్‌ఫోన్ కూడా పనిచేయదు. బాహ్యప్రపంచంతో సంబంధం లేని కాకసనూరులో కొండరెడ్డి గిరిజన తెగ చెందిన పీవీటీజీ గ్రూపు వారు నివాసముంటారు. సార్వత్రిక ఎన్నికల దరిమిలా ఈ ప్రాంతంలో పేరంటాళ్లపల్లి, టేకుపల్లి, కాకసనూరు ఆవాసాలకు చెందిన 472 ఓటర్లు ఇక్కడున్నారు. సిబ్బంది ఎన్నికల విధుల నిమిత్తం కాకసనూరు చేరుకోవాలంటే గోదావరి నది మీద పడవ ప్రయాణం తప్పనిసరి. కలెక్టర్ ప్రసన్న వెంకటేష్ ఆధ్వర్యంలో జిల్లాలో పోలింగ్ సజావుగా జరగడానికి అన్ని ఏర్పాట్లు చేసినా కాకసనూరులో ఎన్నికల విధులు నిర్వహించడం సిబ్బందికి ఇబ్బందే అని చెప్పచ్చు. అయితే కాకసనూరు గ్రామానికి ఎవరైనా ఇతర ప్రాంతాల నుంచి వస్తే ఈ ప్రాంత కొండారెడ్డి గిరిజన తెగవారు వారి సంప్రదాయాల ప్రకారం స్వాగతం పలకడం ఆనవాయితీ. పోలింగ్‌కు ఒకరోజు ముందుగా సిబ్బంది కాకసనూరు గిరిజన తండాకు వస్తారని తెలుసుకొని రాత్రి సమయం అని కూడా చూడకుండా గిరిజన సంప్రదాయాల ప్రకారం ఘన స్వాగతం పలికి సత్కరించారు. ఈ సందర్భంగా పోలింగ్ కేంద్రం ప్రిసైడింగ్ అధికారి ప్రసాద్, ఎన్నికల సిబ్బంది కాకసనూరు గిరిజనులకు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో జిల్లా పంచాయతీ అధికారి తూతిక శ్రీనివాస విశ్వనాథ్, సబ్ ఇన్‌స్పెక్టర్ యు.లక్ష్మీనారాయణ, విస్తరణ అధికారి యం.శ్రీహరి తదితరులు ఉన్నారు.